# అలౌకికుడు

**విశాలమైన ఆ ఆవరణలో పరుచుకున్న ఖరీదైనతనం వెల వెలబోతున్నట్లుంది.**

ఆ ఇంటిముందు ఎవరో పడుకొని ప్రశాంతంగా నిద్రపోతున్నట్లున్నాడు. ఆయన శరీరం మీద తెల్లటి గుడ్డనొకదాన్ని కప్పారు. అది కూడా చాలా ఖరీదుగానే ఉంది.

ఆయన పక్కన వెలుగుతున్న అగరొత్తులు గొప్ప సువాసనను ఆ ప్రాంతమంతా వ్యాపిస్తున్నాయి.

అంత పెద్ద భవనం ముందు ఆయన సరదాకి అలా పడుకున్నట్లు అనిపిస్తోంది గానీ ఆయన మరణించాడు.

ఇంత అకస్మాత్తుగా మరణించటమనే విషయమో, మరోటోగానీ అక్కడున్న వారి కళ్ళలో కొద్దిపాటి ఆశ్చర్యమూ, మరికొంత విచారమూ చోటు చేసుకున్నాయి. పనివాళ్ళు చేస్తున్న, చేయాల్సిన పనులన్నింటిని ఆపేసి చూస్తున్నారు. వారి కళ్ళలో అదోరకం దిగులు గూడుకట్టుకొని ఉంది.

అక్కడ బీభత్సంగా ఏడుస్తున్న దృశ్యాలు లేవుగానీ మొత్తం మీద కొందరు కళ్ళు తుడుచుకుంటున్నారు. ఒకరిద్దరు మాత్రం బయటకు శబ్దం రాకుండా ఏడుస్తున్నారు.

దూరంగా నిలబడ్డ కొందరు మాత్రం ఆయన గతం గురించో, జ్ఞాపకాల గురించో చెప్పుకుంటున్నట్లున్నారు.

ఆ సమయంలో అక్కడకు వచ్చాడాయన.

''పంతులుగారొచ్చారు.. పంతులుగారొచ్చారు'' ఎవరో చాలా మెల్లగా అన్నారు.

ఆ క్షణం ఓ చిత్రమైన వాతావరణం నెలకొందక్కడ

నిశ్శబ్దంకూడా వణికిపోతున్నట్లుంది. ఎవరూ మాట్లాడకుండానే ఆయన్ను ఆహ్వానించారు కళ్ళతో

ఆయన వచ్చి ఓ నిమిషం శవాకారంలో ఉన్న మనిషిని ఆసాంతం పరికించేడు.

ఆ తర్వాత కళ్ళు మూసుకుని ఏదో గొణిగేడు తన్మయత్వంతో

అందరూ ఆయన్నే చూస్తున్నారు.

''మహామభావుడు'' పంతులుగారి నోటి నుండి వెలువడ్డాయా మాటలు.

అక్కడి గాలి కొద్దిగా వళ్ళు విరుచుకుని తిరిగి స్తంభించింది. ఆయన ఎవరిని ఉద్దేశించి చెబుతున్నాడో ఎవరికీ అర్థంకాలేదు. కానీ ఆ ఆవరణలో ఉన్నవారంతా పంతులుగారికేసి చూస్తూ ఆయన మాటలు వింటుండిపోయారు.

''జాతస్యమరణం'' అన్నారు పెద్దలు. పుట్టిన ప్రతివారూ మరణించాల్సిందే. ప్రతి జీవీ కూడా తాను ప్రశాంతంగా చనిపోవాలని కోరుకుంటుంది. ముఖ్యంగా మానవుడు తాను ఎవరికీ భారం కాకుండా, మంచంలోపడి తీసుకోకుండా మరణించాలనుకుంటాడు. అలాంటి మరణాలు కూడా అందరికీ రావు. కొద్దిమందికి మాత్రమే లభ్యం అవుతాయి.

పెద్దాయన అన్ని రకాలుగా అదృష్టవంతుడు.ఆయన ప్రశాంతంగా ఆ భగవంతుడి దగ్గరికి ప్రయాణం ఆరంభించేరు. అంతే అయితే ఆయన గురించి చెప్పుకోవాల్సిందేముంది! ఆయన మరణం కూడా ఓ అద్భుతం. ఏ భగవంతుడిలో ఐక్యం కావటానికి తపిస్తుంటామో, ఆయన చెంతకు మహాపర్వదినమైన ఈ శివరాత్రి రోజున ఆయన పయనించారు. ఇలాంటి మరణం కోరుకున్నంత మాత్రాన లభించగలదా? అంతేనా.... ఆయన మరణిస్తూ కూడా మనందరికీ ఓ ఉపకారం చేసి వెళ్ళారు. పెద్దాయనతో పాటు రాత్రంతా అందరూ మేల్కొంటారు. ఆ గరళకంఠుడ్ని స్మరిస్తారు. అందరికీ ఈ లౌకిక ప్రపంచంనుండి ఆలోచనలు మళ్ళుతాయి. ఆ విధంగా మనమందరం ఆ సర్వేశ్వరుడికి మరింత చేరువవుతాం''

పంతులుగారి మాటలు ఆగిపోయాయి.

ఆయన తిరిగి కళ్ళు మూసుకున్నారు.

తిరిగి అందరూ తమ కబుర్లలో పడ్డారు. పంతులుగారు మెల్లగా వెళ్ళి పెద్దాయన భార్య దగ్గర కూర్చుని వేదాంతం బోధించటం మొదలుపెట్టారు. క్రమక్రమంగా ఆమె నుండి దుఃఖం మాయం అయింది. ఆమె కళ్ళలో ఆశ్చర్యంతో కూడిన వెలుగు కనిపించింది. ఆమెకు పంతులుగారి మాటలే స్మరణకొస్తున్నాయి.

''మానవుడు నిమిత్తమాత్రుడు. ఇదంతా వాస్తవం అని మనం భ్రమిస్తుంటాం. కాదు. ఇది వాస్తవం కాదు. ఇదంతా మాయ. భగవంతుడు మనల్ని ఈ నాటకరంగం మీదకు పంపిస్తాడు. ఎవరి పాత్ర పూర్తయితే వారు తెరవెనక్కి వెళ్ళిపోవలసిందే.

మరణమూ అంతే''

పెద్దాయన్ని ఘనంగా దహనం చేశాక, చేయకముందు కూడా అక్కడకొచ్చిన అనేకమంది ఆధునికులు పంతులుగారి తాత్విక దృష్టినీ, ఆయన వివరణనూ పదే పదే వల్లించారు.

వారందరూ పెద్దాయన 'మరణం' ఓ 'అద్భుతం' అని అంగీకరించారు.

* * *

అదే ఆవరణ....


అయితే అక్కడున్న వారందరిలోనూ ఏదో కంగారు. అక్కడ పని చేస్తున్న వారికళ్ళలో భయం తొంగి చూస్తోంది. లోపల గదుల్లో ఎవరెవరో మాట్లాడుకుంటున్నారు. ఎవరో ముసలావిడ ఏడుస్తున్న ధ్వని వినపడుతోంది.

అంతలోనే ఆ భవనం ముందు పోలీస్ జీప్ ఆగింది. అందులోనుండి నలుగురు కానిస్టేబుల్స్ తో పాటు ఓ అధికారి దిగాడు. అప్పటికి రెండోసారి ఆయన రావటం.



రాత్రి ఏం జరిగిందో మరోసారి వివరించాడు ఆ ఇంటి యజమాని.

"ఈ రోజు శ్రావణ శుక్రవారం. వరలక్ష్మీ వ్రతం చేయాలి. అందుకే లాకర్ నుండి నగలు తెచ్చి నా బెడ్ రూంలో ఉన్న ఐరన్ సేఫ్‌లో ఉంచాం. తిరిగి ఈ కార్యక్రమం పూర్తయ్యాక లాకర్‌లో దాచుకోవాలనుకున్నాం. దాదాపు రెండు గంటల సమయంలో ఓ అరడజను మంది క్రుర్రాళ్ళు తలుపులకు రంధ్రాలు చేసి వచ్చారు. వారి తలలకు గుడ్డలు చుట్టుకున్నారు. హిందీలో మాట్లాడినట్లు గుర్తు. మేం మా గదిలో పడుకున్నాం. వెనకనుండి లోనకు వచ్చారు. ముందు మా అమ్మ దగ్గర ఉన్న వాటన్నింటినీ లాక్కున్నారు. ఆ తర్వాత మా తలుపు కొట్టారు. అమ్మ అనుకొని వచ్చాం. ఆ తర్వాత మామూలే.



నగల్తో పాటు డబ్బుకూడా దోచుకెళ్ళారు. ఫోన్ చేద్దామనుకుంటే తీగలు కత్తిరించి వెళ్ళిపోయారు"

ఆ అధికారి ఏవేవో ప్రశ్నలు అడుగుతున్నాడు. ఆయన చెబుతున్నాడు. ఇల్లంతా తిరిగి చూస్తున్నారు. వేలి ముద్రల లాంటివి లభించగలవేమోనని.

ఆ సమయంలోనే పంతులుగారొచ్చారు.

ముసలావిడ పంతులుగార్ని చూసి బావురుమంది.

"ఈ కొంపకు ఏదో శని పట్టుకుంది. వరలక్ష్మీవ్రతం చేయాలనుకోవటం ఏమిటి... అయిదు లక్షల రూపాయలు ఆళ్ళ ఎదాన కొట్టటమేంటి... ఎన్ని సంవత్సరాలు కష్టపడితే వొచ్చేనా" అంటూ ఏడవటం మొదలుపెట్టింది.

అదే సమయంలో పోలీస్ అధికారి చెబుతున్నాడు. "ఇట్సాల్ రైట్ ఈ దోపిడి వెనకాల ఎవరున్నారో త్వరలోనే మేం గుర్తించగలమనుకుంటున్నాను. అంతేకాదు మీ నగలు మీకు తప్పకుండా లభించి తీరతాయి"

ఇంటి యజమాని పన్నటి నవ్వును బలవంతంగా పెదాలమీదకు తెచ్చుకున్నాడు.

"ఏ మాత్రం అనుమానం వచ్చినా, విశేషమున్నా వెంటనే మాకు ఫోన్ చెయ్యండి" అని చెప్పి బయటకు నడిచాడాయన.

అప్పటికే పంతులుగారు ఏదో చెబుతున్నారు.

ఇంటి యజమానిని చూసి తిరిగి కళ్ళు మూసుకున్నారు.

"చూడండీ ఈ విషయంలో మీరేం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నగలు దోచుకుపోయారనుకుంటున్నారు మీరు. కానీ ఓ విషయం అర్థం చేసుకోవటానికి మీరు ప్రయత్నం చెయ్యండి. ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు. ఆ భగవంతుడి లీలలు అర్థం చేసుకోవటం మనకు సాధ్యపడుతుందా? తనకు కావలసిన వారిని తన చెంతకు పిలిపించుకుంటాడు. అందులోనే ఎవరి పాప పుణ్యాలు వారికి రాసి ఉంటాయి. పెద్దాయన్ని మహాశివరాత్రి పర్వదినాన తనచెంతకు రప్పించుకుంది ఆయనే. ఈ రోజున నగలు కావలసి వచ్చాయి. అసలు ఆ నగలు ఎవరివి! భగవంతుడివి కాదూ! ఈ ప్రపంచంలో ఉన్న ప్రతీదీ అతని సృష్టికదూ! మనం ఈ సత్యం తెలుసుకోలేక భౌతికమైన వస్తువులపట్ల మమకారం పెంచుకుంటాం. మీరు దిగులు పడొద్దు. ఆ కలియుగ దైవమే దొంగల రూపంలో వచ్చి వాటిని తీసుకువెళ్ళాడు. తన మహిమలను తెలియజెయ్యటమే ఆయన లీలల్లో భాగం. శ్రావణ శుక్రవారం రోజున ఆ పుణ్యఘడియల్లోనే ఈ నగలు ఎందుకు పోయాయో మీరు ప్రశాంతంగా ఆలోచించగలిగితే అందులోని రహస్యం మీకు బోధపడుతోంది. ఈ కుటుంబం ఎంత పుణ్యం చేసుకుందో తలుచుకుంటే తనువు పులకరిస్తోంది. ఎంత అద్భుతమైన విషయాలు జరుగుతున్నాయి. నిజంగా ఆ లీలా మానుష వేషధారి చర్యల్ని అర్థం చేసుకోవడం మానవ మాత్రులకు సాధ్యం అవుతుందా?"

పంతులుగారు ఈ ప్రపంచాన్ని మరిచిపోయి చెప్పుకుపోతున్నారు.

ఇంటి యజమానీ, ముసలావిడ ఇంకా మిగతా అందరూ పంతులుగారికేసి చూస్తున్నారు.

ఆయనే వారికేసి చూడటం లేదు.

**ఈ కథ ఇక్కడితో ముగిస్తున్నా, ఆ తర్వాత ఏం జరిగి ఉంటుందో మీకు వదిలేస్తూ!** ○